సాక్షి హనుమకొండ

గురువారం | 27 | జూలై | 2023



బ్రాహ్మణులకు ప్రత్యేక స్థానం

రాష్ట్రంలో బ్రాహ్మణ పరిషత్ స్థాపనతో బ్రాహ్మణ కులస్తులకు సముచిత స్థానం లభించిందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. - 8లో▸



రూ.10లక్షల గంజాయి పట్టివేత

కాజీపేటలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని రూ.10లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 27° /24°

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో ఉరుములు మెరుపులతో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయి.

న్యూస్‌రీల్

అతిథి అధ్యాపకుల నియామక ప్రక్రియ వాయిదా

హన్మకొండ అర్బన్: పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలలో గురువారం జరగాల్సిన అతిథి అధ్యాపకుల నియామక ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కళాశాల విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు విద్యా సంస్థలకు రెండ్రోజుల సెలవులు ఉండడంతో ఈనియామక ప్రక్రియను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. తదుపరి తేదీని త్వరలోనే ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

ఆర్పీఎఫ్ స్టేషన్లకు అవార్డు

కాజీపేట రూరల్: కాజీపేట సబ్ డివిజన్ పరిధి కాజీపేట, వరంగల్, ఖమ్మం రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీస్‌స్టేషన్లకు న్యూఢిల్లీ రైల్వే డైరెక్టర్ ఆఫ్ జనరల్ (డీజీ) అవార్డు లభించింది. బుధవారం ఆర్పీఎఫ్ పోలీసు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. విధి నిర్వహణలో బాల కార్మికుల అక్రమ రవాణాను అడ్డుకొని వారి విముక్తికి కృషికి, అత్యున్నత సేవలు అందించినందుకుగాను పోలీస్‌స్టేషన్లు అవార్డుకు ఎంపికయ్యాయని తెలిపారు. మూడు స్టేషన్లకు కలిపి బెస్ట్ ఫర్ఫార్మెన్స్ కింద రూ.16,000లు డీ.జీ సంజయ్ చందర్ నగదు పురస్కారం ప్రకటించినట్లు పేర్కొన్నారు. అవార్డు వచ్చినందుకు ఆర్పీఎఫ్ అధికారులు ఆనందం వ్యక్తం చేశారు.

స్వీయ మూల్యాంకనంతోనే పాఠశాల అభివృద్ధి



విద్యారణ్యపురి: స్వీయ మూల్యాంకనంతోనే పాఠశాల అభివృద్ధి జరుగుతుందని 'శాలసిద్ధి'పై హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అవగాహన పెంచుకోవాలని హనుమకొండ డీఈఓ ఎండీ అబ్దుల్‌హై కోరారు. బుధవారం జిల్లాలోని ఎంపిక చేసిన 31 పాఠశాలల హెచ్‌ఎంల, ఉపాధ్యాయులకు శాలసిద్ధిపై హసన్‌పర్తిలోని మిలీనియం హైస్కూల్‌లో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధ, గురువారం జరిగే వర్క్‌షాప్‌లో శాలసిద్ధిపై అవగాహన పెంచుకోవాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్, జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, కమ్యూనిటీ మొబలైజింగ్ కో–ఆర్డినేటర్ బి.రాధ, మండల విద్యాశాఖాధికారి రాంకిషన్ రాజు, రిసోర్స్‌పర్సన్లు కట్ల శ్రీనివాస్, భిక్షపతి, రామచంద్రారెడ్డి మాట్లాడారు.

బోధనా ప్రణాళికతో అభ్యసనం సులభం



కాశిబుగ్గ సెంటర్ : ఉపాధ్యాయుల బోధనా ప్రణాళికల ద్వారా విద్యార్థుల అభ్యసన సులభం అవుతుందని డీఈఓ వాసంతి అన్నారు. వరంగల్‌లోని ఏవీవీ పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులకు నిర్వహించిన తొలిమెట్టు శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ వాసంతి మాట్లాడుతూ ఉపాధ్యాయులు జిల్లాస్థాయి శిక్షణలో నేర్చుకున్న అంశాలను మండలస్థాయి ఉపాధ్యాయులకు నిర్వహించే శిక్షణలో వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి సారయ్య, వరంగల్ ఎంఈఓ ఎస్.విజయ్‌కుమార్, ఉర్దూ శిక్షణ కోర్సు డైరెక్టర్ జి.అశోక్ కుమార్ పాల్గొన్నారు.



ఆత్మకూరు: మత్తడి పోస్తున్న కటాక్షపూర్ చెరువు

అతలాకుతలం

- జిల్లావ్యాప్తంగా భారీ వర్షం
- నిండు కుండల్లా చెరువులు
- ప్రవాహంతో దుంకుతున్న మత్తళ్లు
- కూలిన ఇళ్లు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు



కమలాపూర్ 11వ వార్డులో నిలిచిన నీరు



ఎల్కతుర్తి: జోరుగా పారుతున్న ఎల్కతుర్తి వాగు





పరకాల: మత్తడి ప్రవాహంలో పరకాల పెద్ద చెరువు, పరకాల–కానిపర్తి మధ్య నిలిచిన రాకపోకలు

హనుమకొండ/ఆత్మకూరు/ఎల్కతుర్తి/కమలాపూర్/శాయంపేట/పరకాల: జిల్లా వ్యాప్తంగా మూడ్రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి జన జీవనం అతలాకుతలమవుతోంది. చెరువులు, కుంటల్లో భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. చెరువులు, కుంటలు అలుగులు పారుతున్నాయి. వాగులు పొంగిపొర్లుతున్నాయి. పలుచోట్ల నాటేసిన పొలాలు నీట మునిగాయి.

- బుధవారం కురిసిన జడివానకు ఆత్మకూరు మండలంలోని కటాక్షపూర్ చెరువు మత్తడి దుంకుతోంది. ఈచెరువు జాతీయ రహదారి 163పై ఉండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చెరువు మత్తడిని పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్, ఆత్మకూరు సీఐ రవిరాజు, ఎస్‌ఐలు ప్రసాద్, రాజేశ్‌రెడ్డి, తహసీల్దార్ సురేశ్‌కుమార్ పరిశీలించారు.
- వర్షానికి నీరుకుళ్లలోని ఎస్సీ కాలనీకి చెందిన పూజల లక్ష్మి ఇల్లు కూలిపోయింది. మామిడి రాజయ్య ఇంటి గోడలు కూలాయి. ఆత్మకూరు మండల కేంద్రంలో ఎంఆర్సీ భవనం చుట్టూ, సబ్‌స్టేషన్ ఆవరణలోకి వరద నీరు చేరింది.
- ఎల్కతుర్తి మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీ సమీపంలో భారీగా వరదనీరు చేరి వరిపంట పూర్తిగా నీట మునిగింది. ఎల్కతుర్తి శివారు సత్యసాయి గార్డెన్ సమీపంలో పత్తి పంట నీటమునిగింది. వరద తాకిడికి తట్టుకోలేక జీల్గుల నుంచి పెంచికలపేటకు వెళ్లే రోడ్డు కోతకు గురైంది. మండల కేంద్రంలోని మూడో వార్డు సమీపం నుంచి మసీదు వరకు రహదారి బురదమయంగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి రహదారి వెంట మొరం పోయించాలని కాలనీవాసులు కోరుతున్నారు. స్థానిక వాగు, కోతుల నడుమ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.
- కమలాపూర్ మండల వ్యాప్తంగా బుధవారం మధ్యాహ్నం సుమారు రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి కమలాపూర్‌లోని 11వ వార్డు పూర్తిగా జలమయమైంది. ఇళ్లలోకి వరద నీరు చేరి స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గట్టిగా వాన పడిన ప్రతిసారీ కాలనీలోకి వరద నీరు చేరుతోందని, అధికారులకు మొరపెట్టుకున్నా.. పట్టించుకోవట్లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కమలాపూర్ మండల వ్యాప్తంగా బుధవారం ఉదయం 8.30 వరకు 15.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.
- శాయంపేటలోని ప్రధాన చౌరస్తా నుంచి ఆరెపల్లికి వరకు చేపడుతున్న రోడ్డు చెరువును తలపిస్తోంది. మూడేళ్లుగా నత్తనడకన కొనసాగుతున్న రోడ్డు పనులు, సైడ్ డ్రెయిన్ పూర్తిగా దెబ్బతిని వర్షపు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. మండల పరిధి జోగంపల్లి శివారు చలివాగు ప్రాజెక్టులో వరదనీరు చేరి మత్తడి పోస్తోంది. వివిధ గ్రామాల్లో చెరువులు, కుంటలు నిండిపోయి మత్తడి పోయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- పరకాల చలివాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దామెర చెరువు మత్తడిపడే దశకు చేరుకోగా.. పరకాల పెద్ద చెరువు మత్తడి పడి వరద ప్రవాహం పెరిగింది. పరకాల నుంచి కానిపర్తి, నాగుర్లపల్లి, లింగాల, రేపాకపల్లె, గోపాల్‌పూర్, కొడవటంచ తదితర గ్రామాలకు సులువుగా వెళ్లడానికి దగ్గరిమార్గంగా ఉండే రహదారిలోని లోలెవల్ వంతెన మీదుగా వరద ప్రవాహం పెరిగి రాకపోకలు నిలిచాయి. కాగా.. రాకపోకలు జరగకుండా ఆయా లోలెవెల్ వంతెనల వద్ద ముళ్ల కంచెలు, కర్రలను స్థానికులు అడ్డుగా ఉంచారు.

జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం



మత్తడి పోస్తున్న కోగిల్వాయి శనిగ చెరువు

హనుమకొండ జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మంగళవారం ఉదయం 8.30 నుంచి బుధవారం ఉదయం 8.30 వరకు జిల్లాలో సగటున 19.1 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. భీమదేవరపల్లిలో 32 మిల్లీమీటర్లు, వేలేరులో 35.9, ఎల్కతుర్తిలో 17.4, కమలాపూర్‌లో 11.8, హసన్‌పర్తిలో 11.7, ధర్మసాగర్‌లో 23.8, కాజీపేటలో 17.5, హనుమకొండ 16.2, ఐనవోలు 7.7, పరకాలలో 17.9, దామెరలో 23, ఆత్మకూరులో 18.4, శాయంపేటలో 13.2, నడికూడలో 20.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బుధవారం రాత్రి 11 గంటల వరకు ఆటోమేటిక్ వెదర్ స్టేషన్‌లో నమోదైన వర్షపాతం వివరాలను వాతావరణ శాఖ విడుదల చేసింది. కమలాపూర్ మండలం మరిపల్లిగూడెంలో 124.5 మిల్లీ మీటర్లు, ఎల్కతుర్తిలో 107.5; ఐనవోలులో 105.8, మడికొండలో 103.3, దామెరలో 97.3, కమలాపూర్‌లో 96.8, పెద్ద పెండ్యాలలో 84.3, ధర్మసాగర్‌లో 81, నడికూడలో 78.8, కాజీపేటలో 73, హసన్‌పర్తిలో 72, భీమదేవరపల్లిలో 70.3, దామెర మండలం పులుకుర్తిలో 68.3, హనుమకొండ పెద్దమ్మగడ్డలో 67, శాయంపేటలో 64.8, వేలేరులో 45.3, హసన్‌పర్తి మండలం నాగారంలో 36.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



పరకాల: ఉధృతంగా ప్రవహిస్తున్న పరకాల చలివాగు



పరకాల: పెద్ద చెరువు వద్ద చేపలు పడుతున్న మత్స్యకారుడు

ముగ్గురికి జైలుశిక్ష



శాయంపేట: పరకాల జూనియర్ సివిల్ కోర్టులో రెండు కేసుల్లో సాక్ష్యులను విచారించిన పరకాల మెజిస్ట్రేట్ శాలిని లింగం ముగ్గురు వ్యక్తులకు నాలుగేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.6 వేలు జరిమానా విధించారు. మరో కేసులో నల్లెల్ల రమేశ్‌కు రెండేళ్ల ప్రొహిబిషన్ అఫండర్ యాక్ట్‌తో పాటు రూ.5వేలు జరిమానా విధించారు. శాయంపేట మండలం గట్లకానిపర్తి గ్రామానికి చెందిన బొడకుంట్ల సాంబయ్యను అదే గ్రామానికి చెందిన తిప్పని మొగిలి, చందర్, లలిత భూమి విషయంలో గొడవపడి కర్రలతో కొట్టారు. బాధితుడు సాంబయ్య 2018లో ముగ్గురిపై ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపి చార్జ్‌షీట్ ఫైల్ చేసి కోర్టుకి పంపించారు. పరకాల మెజిస్ట్రేట్ శాలిని లింగం సాక్ష్యులను విచారించి తీర్పునిచ్చారు. మరో కేసులో శాయంపేటకు చెందిన నల్లెల్ల మాధవిని భూముల విషయంలో ఆమె బావ నల్లెల్ల రమేశ్ కొట్టి, తిట్టాడు. మాధవి 2018లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టి రమేశ్‌పై కేసు నమోదు చేసి పరకాల కోర్టుకు పంపించారు. సాక్ష్యులను విచారించి నల్లెల్ల రమేశ్‌కు (పీఓఏ), జరిమానా విధించారు. రెండు కేసుల్లో విచారణలో ప్రతిభ చూపిన ఏసీపీ కర్రు రుధిర, అర్జుకుమార్, కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్ ప్రసాద్, పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్, రూరల్ సీఐ శ్రీనివాసారావు, ఎస్సై దేవేందర్‌ను పరకాల మెజిస్ట్రేట్ శాలిని లింగం అభినందించారు.

ప్రజలు జాగ్రత్తగా ఉండాలి 8లో▸

ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు

గుండె'జల్లు'.. 8లో▸

ఉమ్మడి వరంగల్ జిల్లాలో జనజీవనం అస్తవ్యస్తం

ఉప్పొంగిన గోదావరి 10లో▸

ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్నవాగు

పరిస్థితి అదుపులోనే ఉంది 8లో▸

- అధికారులందరూ పని చేసే చోట ఉండాలి
- హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్

అప్రమత్తంగా ఉండాలి 8లో▸

- సమస్యలు తలెత్తితే 91542 52936కు ఫోన్ చేయాలి
- వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

- మరిన్ని ఫొటోలు: 9లో▸

అత్యవసరమైతే తప్ప బయటికి రావొద్దు

పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్



వరంగల్ క్రైం: భారీ వర్షాల దృష్ట్యా కమిషనరేట్ పరిధిలోని ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రావొద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాలువల, చెరువుల వద్దకు వెళ్లవద్దని, చెట్ల కింద, పాడైన భవనాల కింద ఉండవద్దని సూచించారు. వాహనదారులు ప్రయాణించేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, వర్షానికి రోడ్లు కొట్టుకుపోయి గుంతలు ఏర్పడుతున్నాయని, అందులో నీరు నిల్వ ఉండడంతో వాహనదారులకు కనిపించక ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని తెలిపారు. వర్షాలకు కల్వర్టు, చిన్న చిన్న బ్రిడ్జిల వద్ద నీరు ప్రవహిస్తున్నప్పుడు వాహనాలతో దాటడానికి సాహసం చేయరాదని సూచించారు. ప్రజలకు సెంట్రల్, ఈస్ట్, వెస్ట్ జోన్ పరిధిలోని పోలీస్ యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే స్థానిక పోలీస్ అధికారులకు లేదా డయల్ 100కి ఫోన్ చేసి సహాయం పొందాలని సూచించారు.

కంటి మీద కునుకు లేదు!

శాంతినగర్ జలదిగ్బంధం



హన్మకొండ: భారీ వర్షాలు ముంపు ప్రాంత వాసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ముంపు ప్రాంతాల ప్రజల బాధలు వర్ణనాతీతం. ఇంటి నిండా బురద. క్రిమి కీటకాలు. అడుగు తీసి వేయలేని పరిస్థితి. కనీసం వంట చేసుకునేందుకూ వీల్లేని పరిస్థితి. ఇక మూడ్రోజుల నుంచి నిద్ర కరువైంది. కాలకృత్యాలు కూడా తీర్చుకోలేని పరిస్థితి. హనుమకొండ హౌజింగ్ బోర్డు కాలనీని ఆనుకుని ఉన్న శాంతినగర్ కాలనీలో బుధవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షం అనంతరం 'సాక్షి'కి కనిపించిన పరిస్థితులు ఇవి. భారీ వర్షానికి ఎగువ నుంచి వచ్చిన వరద నీటితో శాంతినగర్‌కు వరద పోటెత్తింది. ముంపునకు గురై ఇళ్లలోకి వరద నీరు చేరింది. నిత్యావసర వస్తువులతో పాటు, దుస్తులు, ఇతర వస్తువులు అన్నీ పాడైనట్లు శాంతినగర్‌వాసులు చెబుతున్నారు. ఇళ్లలోకి వచ్చిన నీటిని ఎత్తిపోసేందుకు తంటాలు పడుతున్నారు. మూడ్రోజులుగా నిద్రలేదని, కనీసం మధ్యాహ్నమైనా పడుకుందామంటే.. ఈసమయంలో వర్షం పడిందని ఆవేదన చెందారు. వృద్ధులు, గర్భిణుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది.

రోడ్డుకు ఇరువైపులా డ్రెయిన్స్‌తో జలదిగ్బంధానికి చెక్

- పోరస్ ఆస్ఫాల్ట్ పేవ్‌మెంట్, పోరస్ కాంక్రీట్ పేవ్‌మెంట్ టెక్నాలజీతో కూడిన రోడ్లపై పరిశోధనలు
- నీరు నిల్వ ఉండకుండా ఇంకిపోవడం వీటి ప్రత్యేకత
- నిట్ ప్రొఫెసర్లు శంకర్, పీవీ.రావు, శ్రీధర్



శంకర్



పీవీ రావు



శ్రీధర్

కాజీపేట అర్బన్: వరుసగా కురుస్తున్న వర్షాలకు గ్రేటర్ వరంగల్ నగరం జలమయమైపోతోంది. జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ప్రయాణం ప్రాణసంకటంగా మారుతోంది. నగరాన్ని జలదిగ్బంధం నుంచి విముక్తి కల్పించేందుకు, ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు చేపట్టాల్సిన మార్పులపై నిట్ ప్రొఫెసర్లు ట్రాన్స్‌పోర్ట్ స్పెషలిస్ట్ శంకర్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ అండ్ వేస్ట్ వాటర్ స్పెషలిస్ట్‌లు పీవీ.రావు, శ్రీధర్‌లు తగిన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఈ మేరకు బుధవారం వారు 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు వారి మాటల్లోనే..

రోడ్డుకు ఇరువైపులా సైడ్ డ్రెయిన్స్..

రోడ్డు నిర్మాణంలోనే ఇరువైపులా సర్ఫేస్, సబ్ సర్ఫేస్ సైడ్ డ్రెయిన్స్ నిర్మాణం చేపట్టాలి. తద్వారా వర్షపు నీరు రోడ్డుపై నిల్వ ఉండకుండా సైడ్ డ్రెయిన్స్‌నుంచి నాలాల్లోకి వెళ్లిపోతాయి. అప్పుడు జలదిగ్బంధానికి ఆస్కారం ఉండదు. దీంతోపాటు నగరంలోని నాలాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుండాలి. రెండు రకాల నాలాలు తప్పకుండా ఉండాలి. ఒకటి వర్షపు నీరు ప్రవహించేందుకు, మరోటి మురుగునీరు ప్రవహించేందుకు ఉండాలి.

ఏడాదికి వంద సెంటీమీటర్ల వర్షపాతం..

గతంలో వర్షాకాలంలోనే వానలు పడుతుండేవి. ఈ కాలంలో ఏడాదికి వంద సెంటీమీటర్ల వర్షం కురవాలి. ఇప్పుడు అకాల వర్షాలు.. దీంతోపాటు వర్షాకాలంలో గ్లోబల్ వార్మింగ్‌తో పడితే కుంభవృష్టి. దీంతో వర్షపు నీరు ప్రవహించే నాలాలు సరిగ్గా లేక నగరం జలదిగ్బంధంలో చిక్కుకుంటుంది.

పోరస్ టెక్నాలజీ రోడ్లు ..

నిట్ వరంగల్ ఆధ్వర్యంలో పోరస్ ఆస్ఫాల్ట్ పేవ్‌మెంట్, పోరస్ కాంక్రీట్ పేవ్‌మెంట్ టెక్నాలజీతో కూడిన రోడ్లను నిర్మించేందుకు పరిశోధనలు చేస్తున్నాం. ఈ టెక్నాలజీతో నిర్మించిన రోడ్లపై నీరు నిల్వకుండా భూమిలోకి ఇంకిపోయి నాలాలోకి వెళ్లిపోవడం ప్రత్యేకత. పోరస్ టెక్నాలజీ రోడ్లు అందుబాటులోకి వస్తే నగరంలో వర్షానికి ముంపు ప్రాంతం అంటూ ఉండదు.

నిట్‌లో వరంగల్ డెవలప్‌మెంట్ కమిటీ..

నిట్ వరంగల్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ వరంగల్ డెవలప్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేశారు. ఇప్పటికే నిట్‌తో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ఎంఓయూ ఉంది. పోరస్ కాంక్రీట్, పోరస్ రోడ్లు, సైడ్ డ్రెయిన్స్, వేస్ట్‌మేనేజ్‌మెంట్‌లో స్వచ్ఛ వరంగల్‌కు సాయం అందించేందుకు నిట్ అందుబాటులో ఉంటుంది.

ముంపు ప్రాంతాల పరిశీలన



ఎన్టీఆర్‌నగర్‌ను పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్

వరంగల్ అర్బన్: ముంపు నివారణకు ప్రభుత్వం పరంగా అన్ని సహాయక చర్యలు చేపడుతున్నట్లు మేయర్ గుండు సుధారాణి తెలిపారు. బుధవారం మేయర్, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో వరద తీవ్రత అధికంగా ఉన్న ఎన్టీఆర్‌నగర్, సంతోషిమాత కాలనీ, సాయినగర్, గాయత్రి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా మేయర్ సుధారాణి, కమిషనర్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ.. బల్దియా ఆధ్వర్యంలో.. ముందస్తుగా 43 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఏడాదిలోగా ముంపు సమస్య శాశ్వత పరిష్కారం జరుగుతుందన్నారు. ఈపర్యటనలో కార్పొరేటర్లు సిద్దం రాజు, ముష్కమల్ల అరుణ సుధాకర్, వస్కుల బాబు సీఎంహెచ్‌ఓ రాజేశ్, బయలాజిస్ట్ మాధవరెడ్డి, డీసీపీ ప్రకాశ్‌రెడ్డి, ఈఈ సంజయ్‌కుమార్, ఎంహెచ్‌ఓ జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో మహిళ మృతి

శాయంపేట: వేడి నీళ్ల కోసం పెట్టిన హీటర్ స్విచ్ తీస్తూ విద్యుత్ షాక్‌కు గురై బుధవారం దైనంపల్లి సరోజన(58) అక్కడిక్కడే మృతి చెందింది. ప్రత్యక్ష సాక్ష్యుల కథనం ప్రకారం.. శాయంపేటలోని దళిత కాలనీలో దైనంపల్లి సారయ్య, సరోజన దంపతులు నివసిస్తున్నారు. సారయ్య రోజూ మాదిరిగా కూలీకి వెళ్లిపోయాడు. సరోజన స్నానానికి బాత్రూంలో వాటర్ హీటర్ పెట్టుకుంది. హీటర్ ప్లగ్ తీస్తున్న క్రమంలో ఆమె విద్యుత్ షాక్‌కు గురైంది. ఆమె మనవడు శివప్రసాద్ గమనించి చుట్టు పక్కల వారిని పిలిచాడు. అప్పటికే సరోజన మృతి చెందింది. సరోజన మృతితో కాలనీలో విషాదచాయలు అలుముకున్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై దేవేందర్ కేసు నమోదు చేసుకున్నారు.

యువకుడి ఆత్మహత్య


అనిల్ (ఫైల్)

నర్సంపేట రూరల్ : పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు నర్సంపేట టౌన్‌సీఐ పులి రమేష్‌గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకా రం.. నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామ శివారులోని అమృతండాకు చెందిన భూక్యా రాజేందర్– భద్రమ్మ దంపతుల కుమారుడు భూక్యా అనిల్ (18) నర్సంపేట పట్టణంలో ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. కళాశాలకు సక్రమంగా వెళ్లడంలేదని, చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించారు. దీంతో క్షణికావేశానికి లోనై బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనిల్ గతంలో కూడా రెండుమార్లు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చెన్నారావుపేట: మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన నీరటి రమేష్(47) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతిచెందాడు. రమేష్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 15 సంవత్సరాల క్రితం నర్సంపేట మండలంలోని ఇటుకాలపల్లికి చెందిన సునీతతో వివాహం జరిగింది. వీరికి కుమారుడు ఉన్నాడు. రమేష్ మద్యానికి బానిసై భార్య, కుమారుడిని పట్టించుకోకపోవడంతో భార్య సునీత పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో రమేష్ అధికంగా మద్యం సేవిస్తుండంతో తండ్రి ఐలయ్య మంగళవారం మందలించాడు. మనస్తాపానికి గురైన రమేష్ ఇంట్లో పురుగుల మందు తాగాడు. చుట్టు పక్కల వారు గమనించి చికిత్స నిమిత్తం నర్సంపేటలోని ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. రమేష్ తండ్రి ఐలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేయూకు నేడు సెలవు

- అన్ని పరీక్షలు వాయిదా



కేయూ క్యాంపస్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌తోపాటు, వర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలోని వర్సిటీ అనుబంధ కళాశాలలకు కూడా ఈనెల 27వ తేదీని సెలవుగా ప్రకటించారు. అలాగే, యూనివర్సిటీ పరిధిలో ఈ ఈ నెల 26, 27వ తేదీల్లో జరిగే వివిధ పరీక్షలను కూడా వాయిదా వేశారు.

వాయిదా పడిన పరీక్షలు ఇవే..

కేయూ పరిధిలో ఈ నెల 26న జరగాల్సిన (బుధవారం) బీఫార్మసీ 8వ సెమిస్టర్ పరీక్షలు, బీటెక్ (నాన్‌సీబీసీఎస్) మొదటి సంవత్సరం, నాలుగో సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు, ఈనెల 27న జరగాల్సిన బీఫార్మసీ 8వ సెమిస్టర్ పరీక్షలు, బీటెక్ రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేశామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక తెలిపారు.మళ్లీ ఎప్పుడు నిర్వహించే తేదీలను తరువాత ప్రకటిస్తామని పేర్కొన్నారు.

గుండె'జల్లు'..

ఎల్కతుర్తిలో నీటమునిగిన వరిపంట


కాజీపేట రూరల్:గుంతలు పడిన ఫాతిమా,దర్గా రోడ్డు


ఎల్కతుర్తిలో పత్తిపంటలో నిలిచిన వర్షపు నీరు


దంచికొడుతున్న వానలు..

- నీటమునిగిన పంటపొలాలు
- కూలిన ఇళ్లు.. తెగిపోయిన రోడ్లు

ఆకాశానికి చిల్లు పండిదా అనేలా కురుస్తున్న వర్షాలకు గుండె'జల్లు'మంటోంది. ఉమ్మడి జిల్లాలో కొద్ది రోజులుగా కురుస్తున్న వానలకు కనుచూపు మేర నీరే కనిపిస్తోంది. చెరువులు మత్తళ్లు దూకుతున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో పంట పొలాలు నీటమునిగి అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇళ్లు కూలిపోయి బాధితులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వరద ప్రవాహానికి పలుచోట్ల రహదారులు తెగిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మొత్తంగా జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. - సాక్షి, నెట్‌వర్క్


వాజేడు: నీట మునిగిన పొలాలు


వెంకటాపురం(కె): పాలెంలో కూలిన పెంకుటిల్లు


పలిమెల: కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ


చెన్నారావుపేట: బోజేర్వులో కూలిన ఇల్లు


చెన్నారావుపేట: గుంతలమయమైన రోడ్డు


ఆత్మకూరు : నీరుకుళ్లలో కూలిన ఇల్లు


సంగెం : తీగరాజుపల్లిలో కూలిన పెంకుటిల్లు


పర్వతగిరి: గండిపడిన జమాల్‌పూర్ రోడ్డు


స్టేషన్‌ఘన్‌పూర్: పాంనూర్‌లో మునిగిన పొలాలు



ఖిలా వరంగల్ : మధ్య కోటలో మునిగిన ఆకుకూర పంటలు


కాశిబుగ్గ : చింతా హరిజనవాడలో కూలిన ఇల్లు

ఆదివాసీ ఆణిముత్యం..

స్కాలర్ షిప్‌తో చదువుకుని.. అమెరికాలో ప్రొఫెసర్ స్థాయికి

- మారుమూల ఏజెన్సీ ఆదివాసీ యువకుడి ఘనత
- ఈనెల 28న అమెరికా వెళ్లనున్న ఈక ప్రభాకర్
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు


ల్యాప్‌టాప్‌లో తన ఎంపికను చూస్తున్న ఈక ప్రభాకర్

కొత్తగూడ : కడు పేదరికం.. తినడానికి అన్నం కూడా దొరకని పరిస్థితి. తండ్రి పని చేస్తేనే పూటగడిచేది. లేనిపక్షంలో పస్తులుండడమే. పైగా మారుమూల గ్రామం.. అందులో పాఠశాల కూడా లేని కుగ్రామం. ఇలాంటి తరుణంలో ఎవరికైనా చదువుకోవాలనే ఆలోచనే రాదు. ఏదైనా పని చేసుకుని బతకాలని భావిస్తారు. కానీ అలాంటి వారికి ఈ యువకుడు పూర్తిగా విరుద్ధం. చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించాడు. ఒక పక్క సమస్యలతో సహవాసం చేస్తూనే.. మరో పక్క అనుకున్న లక్ష్యాన్ని చేరుకుని పలువురికి ఆదర్శంగా నిలిచాడు. ఆయననే మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం మారుమూల ఏజెన్సీ ఆదివాసీ గ్రామం దొరవారివేంపల్లికి చెందిన ఈక ప్రభాకర్. తాను ఎంచుకున్న విద్యలో ఖండాంతరాలు దాటి అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ అయోవాలో ప్రొఫెసర్‌గా పని చేసేందుకు ఎంపికయ్యారు. ఎర్ర బస్సు కూడా ఎరగని ఈ గ్రామం నుంచి అమెరికాకు వెళ్లడంపై గ్రామస్తుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈక పాపమ్మ –సమ్మయ్య దంపతుల ప్రథమ సంతానం ప్రభాకర్. తన ఎదుగుదల గురించి ఆయన మాటల్లోనే..

'పోడు వ్యవసాయం ఆధారంగానే మా కుటుంబ పోషణ గడిచేది. తినడానికే ఇబ్బంది పడే పరిస్థితి. గ్రామంలో పాఠశాల కూడా లేదు. 1989లో అప్పటి ఐటీడీఏ పీఓ బెస్ట్ అవైలెబుల్ పాఠశాలలకు విద్యార్థులను ఎంపిక చేస్తున్నారు. హాస్టల్‌కు వెళ్తే కనీసం అన్నం అయినా సరిగా దొరుకుతుందనుకునే పరిస్థితి ఉండేది. ఈ పరిస్థితిలోనే రాజేంద్ర కాన్వెంట్ హై స్కూల్‌లో సీటు వచ్చింది. పాఠశాల చదువులోనే మా తల్లి పాపమ్మ 1997లో మృతి చెందింది. ఈ ఘటనను దిగమింగుకుని పదో తరగతి పూర్తి చేశా. అనంతరం ఇంటర్ ఎల్‌బీ కళాశాల వరంగల్‌లో, కర్నూలు సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాలలో బీజెడ్‌సీ గ్రూపులో డిగ్రీ పూర్తి చేశా. వారణాసిలోని బనారస్ హిందూ యూనివర్సిటీలో బయోటెక్నాలజీలో పీజీ పూర్తి చేశా. బెస్ట్ అవైలెబుల్ స్కీం పూర్తయిన తరువాత ఐటీడీఏ నుంచి స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యా. ఆ స్కాలర్ షిప్‌తోనే డిగ్రీ, పీజీ పూర్తయింది. 2006 నుంచి 2013 వరకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్‌డి పూర్తి చేశా. 2013 నుంచి 2017 వరకు సీఎస్‌ఐఆర్‌ఆర్‌ఏలో రీసెర్చ్ అసోసియేట్‌గా పని చేశా. ఇదే సమయంలో మండలంలోని ఈశ్వరగూడెం గ్రామానికి చెందిన రవళితో వివాహమైంది. పీహెచ్‌డీ ఫెలోషిప్‌లో భాగంగా 'టాటా ఇన్‌స్టిట్యూట్ ఫండమెంటల్ రిసెర్చ్'లో సంవత్సరం పని చేశా. అనంతరం గీతం యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరాను. అక్కడ ప్రొఫెసర్‌గా పని చేస్తూనే గత సంవత్సరం అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ అయోవాలో ప్రొఫెసర్‌గా అప్లికేషన్ చేశాను. నాలుగు దఫాలుగా జరిగిన ఇంటర్వ్యూల ఆధారంగా నన్ను ఎంపిక చేసి వీసా ఇచ్చారు. ఈనెల 28న అమెరికాకు వెళ్తున్నా. ఖండాతరాలు దాటి ప్రొఫెసర్‌గా పనిచేసే అవకాశం వచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉంది'.

ఆదివాసీలకే ఆదర్శం..



చిన్న కారణాలతో విద్యను మధ్యలో వదిలేసి వెనుకబడిపోతున్న ఆదివాసీ యువతకు ప్రభాకర్ ఆదర్శంగా నిలిచారు. సరైన రోడ్డు కూడా లేని తమ గ్రామం నుంచి అమెరికా వెళ్లడం తమకు ఎంతో గర్వంగా ఉందని దొరవారివేంపల్లి గ్రామస్తులు పేర్కొంటున్నారు.

ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు


టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎం డీ గోపాల్ రావు

హన్మకొండ: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలకు ఆస్కారమెక్కువగా ఉంటుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు తెలిపారు. రాష్ట్రంలో రాబోయే మూడు రోజులపాటు అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని, ఈ క్రమంలో విద్యుత్ వినియోగదారులు, రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని బుధవారం ఆయన ఒక ప్రకటనలో సూచించారు. ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లు తాకొద్దని సూచించారు. దుస్తులు ఆరేసే దండేలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. సర్వీస్ వైర్లు అతుకులు లేకుండా చూసుకోవాలన్నారు. రైతులు విద్యుత్ మోటార్లు, స్టాటర్ల వద్ద జాగ్రత్తలు పాటించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లొద్దని, సమస్యలుంటే విద్యుత్ అధికారులు, ఉద్యోగుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల పరిధిలో విద్యుత్ పర్యవేక్షణ చేయడానికి కార్పొరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నిరంతరాయంగా పని చేస్తుందని తెలిపారు. సమస్యలు, ఫిర్యాదులను 9440811244, 9440811245 నంబర్‌లకు ఫోన్ చేసి తెలపాలని కోరారు. అదే విధంగా టోల్ ఫ్రీ నంబర్ 1800 425 0028కు లేదా 1912కు ఫోన్ చేసి తెలపొచ్చన్నారు.

రూ. 10లక్షల గంజాయి స్వాధీనం


నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

కాజీపేట: కాజీపేట పట్టణంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి వద్ద నుంచి రూ. 10లక్షల విలువైన 43 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ చంద్రమోహన్ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన లకం అర్జున్, షేక్ సోహెల్.. ఆంధ్రప్రదేశ్‌లో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి కాజీపేటకు చేరుకున్నారు. ఫాతిమానగర్ టౌన్ రైల్వే స్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్నారు. దీంతో ఎక్సైజ్ పోలీసులు వారిని ఆపి బ్యాగులు తనిఖీ చేయగా 43 కిలోల గంజాయి లభ్యమైంది. దీంతో వారిని అరెస్ట్ చేసినట్లు సీఐ చంద్రమోహన్ తెలిపారు. కాగా, గంజాయి రవాణా చేస్తున్న నిందితులను పట్టుకున్న సీఐ చంద్రమోహన్, ఎస్సైలు సౌమ్య, తిరుపతి, సిబ్బంది ఖలీల్, కోటి, వీరమల్లు, రషీద్, రవీందర్, వెంకటరమణ, ఆయూబ్, లాలయ్యను ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అంజన్ రావు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్ అభినందించారు.

కాజీపేట జంక్షన్‌లో భారీగా గంజాయి పట్టివేత

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో బుధవారం రైల్వే పోలీసులు భారీగా గంజాయిని పట్టుకున్నారు. రైలులో గంజాయిని తరలిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి సుమారు 68 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు గురువారం వెల్లడించనున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

స్వరాష్ట్రంలో బ్రాహ్మణులకు ప్రత్యేక స్థానం

- రూ.232 కోట్ల నిధులతో సంక్షేమం
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


జ్యోతిప్రజ్వలన చేస్తున్న మంత్రి దయాకర్‌రావు

జనగామ: తెలంగాణ రాష్ట్రంలో బ్రాహ్మణ పరిషత్ స్థాపనతో బ్రాహ్మణ కులస్తులకు సముచిత స్థానం లభించిందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని సూర్యాపేట రోడ్డు ఎస్ఎస్ఎన్ గార్డెన్‌లో బుధవారం జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా ధూప దీప నైవేద్య సంఘం అర్చకుల ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డితో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు బ్రాహ్మణ సంక్షేమానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఏటా బడ్జెట్‌లో బ్రాహ్మణ సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పారు. ఇందులో భాగంగా ఇప్పటి వివిధ పథకాల అమలుకు రూ.232 కోట్లు కేటాయించిందన్నారు. నాడు 18 వందల ఆలయాల్లో పని చేస్తున్న అర్చకులకు కేవలం రూ.2 వేల 500 వేతనం ఇవ్వగా.. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత 6 వేల 541 ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు రూ.10వేల వేతనం ఇస్తున్నారన్నారు. తెలంగాణలో బ్రాహ్మణ కులస్తుల జనాభా 3 నుంచి 4 శాతం ఉన్నప్పటికీ 10 శాతం రిజర్వేషన్ వర్తింపజేస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేనివిధంగా హైదరాబాద్‌లో 10 ఎకరాల స్థలంలో బ్రాహ్మణ సదనం నిర్మించినట్లు తెలిపారు. దేవుడి భూములు కూడా కబ్జాలకు గురికాకుండా కాపాడుతున్నామన్నారు. దేవాలయాల నిర్వహణకు ఏడాదికి రూ.10 లక్షలు అందజేస్తున్నామన్నారు. స్పెషల్ డెవలప్ ఫండ్ ద్వారా రాష్ట్రంలోని 14 దేవాలయాల్లో వివిధ పనులు చేపట్టేందుకు రూ.107 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. బ్రాహ్మణ సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న కేసీఆర్‌ను మూడోసారి భారీమెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమం సంఘం జిల్లా అధ్యక్షుడు త్రిపురారి మనోహర్ శర్మ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పిందిపోలు నాగ దక్షిణామూర్తి, ప్రధాన కార్యదర్శి అన్నావజ్జుల ప్రసాద్ శర్మ, కోశాధికారి నందనం హరికిషన్, కన్వీనర్ గోపి కృష్ణమాచార్యులు, కృష్ణమాచార్య సిద్ధాంతి, పాగాల మఠం సాయి శివప్రసాద్, చండీశ్వర్, ఎల్లంబట్ల కరుణాకర్, త్రిపురారి ప్రభుదత్తు, పరమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

పరిస్థితి అదుపులోనే ఉంది..

- అధికారులంతా పనిచేసే చోటే ఉండాలి
- హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్
- అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ: భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, పరిస్థితి పూర్తిగా అదుపులో ఉన్నందున ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. వర్షాల కారణంగా ఎలాంటి పరిస్థితి ఉత్పన్నమైనా, సమర్థంతంగా ఎదుర్కొనేలా అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని సమాయత్తం చేసినట్లు తెలిపారు. బుధవారం హనుమకొండలోని కలెక్టరేట్‌లో అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఇందులో కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. అధికారులు, ఉద్యోగులు సెలవులు పెట్టకుండా పని చేసే చోటే ఉండాలని సూచించారు. ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపడుతున్న సహాయక చర్యల గురించి ఆరా తీస్తూ.. యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వరద ఉధృతి తగ్గిన వెంటనే రోడ్ల పునరుద్ధరణ పనులు చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితిని అంచనా వేయాలన్నారు.

అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలి..

ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా.. సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. మరో రెండ్రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, వరద ప్రభావంతో వ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ, వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్యంపై దృష్టి సారిస్తూ.. ఆశా వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు సమర్థంగా ప్రజలకు సేవలందించేలా అప్రమత్తం చేయాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, భోజన వసతి సదుపాయాలు కల్పించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేపలు పట్టేవారు, పిల్లలు, యువత చెరువులు, వాగులోకి దిగవద్దని సూచించారు. ఎవరైనా ఎక్కడైనా ప్రమాదంలో చిక్కుకుంటే కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- సమస్యలు తలెత్తితే 9154252936 నంబర్‌కు ఫోన్ చేయాలి
- వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య
- వర్షాల నేపథ్యంలో అధికారులతో సమీక్ష


వర్షాలపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్ : ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న వాగులు, చెరువులతో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. నీటి ప్రవాహం ఉన్న వంతెనలు, రోడ్ల మీద ప్రజలు ప్రయాణాలు చేయకుండా చూడాలన్నారు. ఇబ్బందులు ఎదురైతే వెంటనే కంట్రోల్ రూం నంబర్ 91542 52936కు ఫోన్ చేయాలని సూచించారు. కంట్రోల్ రూం సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారని తెలిపారు.

రోడ్లు, రైల్వే లైన్ల భూసేకరణపై ఢిల్లీ నుంచి సమీక్ష..

జిల్లాలో పురోగతిలో ఉన్న రోడ్లు, లిఫ్ట్ ఇరిగేషన్, రైల్వేలైన్లకు సంబంధించిన భూసేకరణపై జిల్లా అధికారులతో బుధవారం కేంద్ర కేబినెట్ సెక్రటేరియట్ సమన్వయ కార్యదర్శి విజయ్‌తివారీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గీసుకొండ, సంగెం, ఖిలావరంగల్, నెక్కొండ మండలాల మీదుగా నిర్మించనున్న రైల్వే మూడో లైన్ భూసేకరణకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సీఎస్ సెల్ కాన్ఫరెన్స్..

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాల పరిస్థితులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్ని జిల్లాల కలెక్టర్లతో సెల్ కాన్ఫరెన్స్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రావీణ్య, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్‌బాషా, అధికారులు పాల్గొన్నారు.

తహసీల్దార్లతో కలెక్టర్ గూగుల్ మీట్ కాన్ఫరెన్స్..

కలెక్టర్ ప్రావీణ్య తహసీల్దార్లతో గూగుల్ మీట్ నిర్వహించారు. దెబ్బతిన్న ఇళ్ల వివరాలు, కోతకు గురైన రోడ్లు, కల్వర్టుల పరిస్థితి, నిండిన చెరువుల వివరాలు, ప్రాణ, పంట నష్టం వివరాలు, తాగునీటి సరఫరా, కరెంట్ పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం తదితర అంశాలపై తహసీల్దార్లతో మాట్లాడారు. ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో హెచ్చరికలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ శ్రీవత్స, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, డీపీఓ కల్పన, అధికారులు పాల్గొన్నారు.